## క్లుప్తంగా

### పెయింటింగ్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక


వరాల సైదులు, అధ్యక్షుడు

నేరేడుచర్ల : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బిల్డింగ్, పెయింటింగ్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని శనివారం నేరేడుచర్లలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా వరాల సైదులు, గౌరవ అధ్యక్షుడిగా పంగ వెంకన్న, ఉపాధ్యక్షుడిగా మిరియాల మల్సూర్, ప్రధాన కార్యదర్శిగా యడవల్లి గోపి, కోశాధికారిగా కుందేటి రాజశేఖర్, గౌరవ సలహాదారులుగా ఎస్‌కె రఫీ, నన్నెపంగ మధు, కార్యవర్గ సభ్యులుగా ఉపేంద్రాచారి, పరంగి మైసయ్య, పుప్పాల నాగరాజు, నల్ల గోపి, నందిపాటి శివ, కల్యాణ్‌ను ఎన్నుకున్నారు.

### క్రీడా దుస్తులు అందజేత


గోపికి క్రీడా దుస్తులు, షూ అందజేస్తున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సంపత్ రెడ్డి

హుజూర్‌నగర్ : యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడల్లో భాగంగా 4 వందల మీటర్ల పరుగు పందెంలో మొదటి బహుమతి పొందిన మండలంలోని బూరుగడ్డకు చెందిన కాంపాటి గోపికి ఆయన అభినందించి స్పోర్ట్స్ డ్రెస్, షూను శనివారం హుజూర్‌నగర్‌లోని తన కార్యాలయంలో అందజేశారు. కాంగ్రెస్ నాయకులు సులువ చంద్రశేఖర్, దగ్గుపాటి బాబురావు, కె.సైదులు, ఆర్.రాము, కె.రవీందర్, జి.రాములు, నాగేంద్ర బాబు, కిషోర్, రాజా, అంబేద్కర్, ప్రవీణ్, కమలాకర్, మట్టపల్లి తదితరులు పాల్గొన్నారు.

### సీసీ కెమెరాల ఏర్పాటుకు 'మైహోం' సాయం

మేళ్లచెరువు : మండల కేంద్రంతో పాటు వెంకట్రామపురం, చౌటపల్లి రోడ్డు, శివాలయం పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానిక మైహోం సిమెంట్ పరిశ్రమ వారు 3 లక్షల 80 వేల రూపాయలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక ఎస్ఐ. పరమేష్‌కు పరిశ్రమ అధికారులు చెక్ అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జీఎం నాగేశ్వరరావు, పరిశ్రమ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి, ఏజీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

### దరఖాస్తు గడువు పెంచాలి

నేరేడుచర్ల : దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక పునరావాస పథకానికి, గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంచాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొణతం నాగిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నేరేడుచర్లలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల పునరావాస పథకం, గురుకుల ప్రవేశాల దరఖాస్తుకు ఫిబ్రవరి 2 చివరి తేదీగా ప్రభుత్వం ప్రకటించిందని, కానీ ఆ రోజు ఆదివారం కావడంతో రెండు రోజుల ముందు నుంచే మీ సేవలు, సీఎస్సీ సెంటర్లు, తహసీల్దార్ కార్యాలయాలకు వికలాంగులు, విద్యార్థులు, రైతులు పెద్దఎత్తున తరలివచ్చే అవకాశం ఉందని, దీంతో సంబంధిత వెబ్‌సైట్ సర్వర్ సమస్యలు తలెత్తుతుందని అన్నారు.

### గుండెపోటుతో రిటైర్డ్ హెచ్‌ఎం మృతి


రామారావు (ఫైల్)

మునగాల : మండల కేంద్రానికి చెందిన రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు వక్కంతుల రామారావు (85) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. కోదాడ పట్టణంలో తన పెద్ద కుమారుడు నాగార్జున నివాసంలో ఆయన మరణించారు. రామారావు స్వస్థలం గరిడేపల్లి మండలం వెలిదెండ కాగ వృత్తిరీత్యా ఆరు దశాబ్దాల క్రితం మునగాల వచ్చి స్థిరపడ్డారు. రామారావు భార్య కూడా ఉపాధ్యాయురాలిగా పని చేసి రిటైర్డ్ అయి పది ఏళ్ల క్రితం అనారోగ్యానికి గురై మృతి చెందారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆదివారం కోదాడలో రామారావు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు నాగార్జున తెలిపారు. కాగా రామారావు మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు.

### సోమప్ప ఆలయానికి నిధులు కేటాయించాలి

నేరేడుచర్ల : మండలంలో 500 ఏళ్ల చరిత్ర కలిగిన సోమప్ప దేవాలయానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని సామాజిక కార్యకర్త, మాజీ సర్పంచ్ సుంకరి క్రాంతికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సోమప్ప ఆలయంలో ఆయన పూజలు నిర్వహించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ ఆలయానికి కనీసం రోడ్డు సౌకర్యం కూడా సరిగా లేదన్నారు. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి ఉత్సవాలు ఉన్నందున మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవ చూపి నిధులు మంజూరు చేసి ఆలయం వరకు రోడ్డు వేయించాలని కోరారు. ఆయన వెంట సామాజిక కార్యకర్తలు జిలకర భాస్కర్, కాసాని నాగరాజు, పాల్వాయి గోపాలకృష్ణ, కోడి వెంకటేశ్వర్లు, చంద్రయ్య, సీత్యా తదితరులు ఉన్నారు.

# పగలెందుకో వెలుగులు?

- రేయింబవళ్లు వెలుగుతున్న వీధిలైట్లు
- వృథా అవుతున్న విద్యుత్


మునగాలలో పగలు వెలుగుతున్న వీధిలైట్లు

మునగాల : మండల కేంద్రంలోని పలు వార్డుల్లో వీధిలైట్లు రేయింబవళ్లు వెలుగుతున్నాయి. వీధిలైట్లను పగలు ఆపేందుకు ఆన్ ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేయకపోవడంతో గత రెండేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో విద్యుత్ వృథా అవుతోందని పలువురు గ్రామస్తులు అంటున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 560 వీధి లైట్లు ఉండగా సుమారు 50 స్తంభాలకు వీధిలైట్లు నిరంతరం వెలుగుతున్నాయి. వీధి లైట్ల ఆన్ ఆఫ్‌కు ఆయా వార్డుల్లో మూడవ విద్యుత్ లైన్ లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ఈ విషయమై గత సర్పంచ్ చింతకాయల ఉపేందర్ పలుమార్లు గ్రామపంచాయతీ తీర్మానం ద్వారా సంబంధిత శాఖకు తెలియజేసినప్పటికీ వారు పట్టించుకోలేదని ఆయన ఆరోపిస్తున్నారు. కాగా, వీధి లైట్లు, నీటి సరఫరాకు చెందిన విద్యుత్ మోటార్లకు సంబంధించి మునగాల గ్రామపంచాయతీ ప్రతి నెల రూ.రెండు లక్షలు విద్యుత్ బిల్లులు చెల్లిస్తోంది. అదేవిధంగా మండలంలోని కొన్ని గ్రామాల్లో కూడా పగలు కూడా వీధి లైట్లు వెలుగుతున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి త్రీఫేస్ లైన్ ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

#### విద్యుత్ అధికారులకు తెలిపాం

మునగాలలోని కొన్ని వార్డుల్లో వీధిలైట్లు రేయింబవళ్లు వెలుగుతున్న మాట వాస్తవమే. త్రీఫేస్ వైర్ లేకపోవడంతోనే ఈ సమస్య. పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గ్రామపంచాయతీ నుంచి ప్రతినెల మా.రెండు లక్షల బిల్లు చెల్లిస్తున్నాం.
– చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి, మునగాల

#### విద్యుత్ వృథాను అరికట్టాలి

మునగాలలోని పలు వార్డుల్లో వీధిలైట్లు రేయింబవళ్లు వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ వృథా అవుతోంది. విద్యుత్ అధికారులు స్పందించి పగలు లైట్లు వెగలకుండా చూసి విద్యుత్‌ను ఆదా చేయాలి.
– తురక గుర్వయ్య, మునగాల

#### స్విచ్‌లు ఏర్పాటు చేసుకోవాలి

మండల కేంద్రంలో సుమారు 30కి పైగా వీధిలైట్లు నిరంతరం వెలుగుతున్నాయి. వీటికి ఆన్ ఆఫ్ స్విచ్‌ల ఏర్పాటు లేకపోవడంతో ఇలా జరుగుతోంది. గ్రామపంచాయతీ ఆన్‌ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేసుకోవాలి. ఈ విషయమై తాము గ్రామపంచాయతీకి గతంలో సూచించాం.
– వికాస్, ట్రాన్స్‌కో ఏఈ, మునగాల

## వృద్ధాశ్రమానికి చిన్నారుల చేయూత


వృద్ధాశ్రమానికి బియ్యం అందజేస్తున్న సిటీ సెంట్రల్ స్కూల్ యాజమాన్యం

మునగాల : కోదాడ పట్టణ పరిధిలోని నయానగర్‌లో గల సిటీ సెంట్రల్ స్కూల్‌కు చెందిన పలువురు చిన్నారులు తమ ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. జనవరిలో వచ్చే నాలుగు బుధవారాల్లో ప్రతి విద్యార్థి తలా పిడికెడు బియ్యాన్ని తీసుకువచ్చి సుమారుగా రెండున్నర క్వింటాళ్ల బియ్యాన్ని సిద్ధం చేశారు. అదేవిధంగా రూ.6వేల నగదును సేకరించారు. వాటిని శనివారం మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమానికి అందజేశారు. సనా గ్రూపు విద్యా సంస్థల చైర్మన్ ఎండీ.నజీరుద్దీన్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ నజీరుద్దీన్, డైరెక్టర్ ఎండి.నౌమన్ వృద్ధాశ్రమం నిర్వహణకు రూ.పదివేల విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ పాల్గొన్నారు.

## భౌతిక శాస్త్రం టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ


చిలుకూరు : టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు


మఠంపల్లి : ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

చిలుకూరు : మండల స్థాయిలో నిర్వహించిన భౌతిక శాస్త్రం టాలెంట్ టెస్టులో ఇంగ్లిష్ మీడియంలో చిలుకూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులు కీర్తి, జ్యోత్స్న, సర్వేష్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి టాపర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు కందిబండ రామారావు, గుండు ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మోడల్ స్కూల్ విద్యార్థులు..**

మఠంపల్లి : మండల కేంద్రంలో మండల ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో మఠంపల్లి సమీపంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు అఫ్రోజ్, కావ్య, శివాని ప్రతిభ కనబరిచి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. వీరిని ఎంఈఓ వెంకటాచారి, ప్రిన్సిపాల్ బుడిగె వీరబాబుగౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


స్వపరిపాలన వేడుకలో జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు


ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

మఠంపల్లి : మండలంలోని వరదాపురంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని శనివారం వేర్వేరుగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పలువురు విద్యార్థులు ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అక్రమంగా తెలంగాణకు ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను శనివారం చింతలపాలెం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా చందర్లపాడు మండలంలోని కాసర బాద్ ఇసుక రీచ్ నుంచి టిప్పర్ ద్వారా ఇసుకను అక్రమంగా మేళ్లచెరువు మండలానికి తలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దొండపాడు గ్రామ శివారులో టిప్పర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జగ్గయ్యపేట మండలం వేదాద్రికి చెందిన సదరు లారీ డ్రైవర్ మామిడాల నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### 'మిట్స్'లో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్

చిలుకూరు : మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సినర్జిమ్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెట్ ఆధ్వర్యంలో ఏడు మల్టీనేషనల్ కంపెనీలు మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మధిర ప్రీతిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కేశవరెడ్డి మాట్లాడుతూ అమెరికా లాంటి పెద్ద దేశాల్లోనూ గ్రామీణ ప్రాంతల నుంచి వెళ్లిన విద్యార్థులే రాణిస్తున్నారన్నారు. విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలని సూచించారు. మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 800 మంది విద్యార్థులు పాల్గొనగా, 327 మంది విద్యార్థులు ఎంపికై నట్లు వారు తెలిపారు. వైస్ చైర్మన్ మధిర గౌతమ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

### అలరించిన రంగవల్లుల పోటీలు


ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

మఠంపల్లి : మండల కేంద్రంలో కానుకమాత చర్చి 26వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మహిళలు, యువతులకు నిర్వహించిన రంగవల్లుల పోటీలు అలరించాయి. ఈ పోటీలను ఫాదర్ మార్టిన్ పసల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వస్కుల జయరాజు, సుధాకర్, పాండు, రవీందర్, దాతలు సామేలు, జోజి, జయరాజ్, సైదులు, భాస్కర్, విజయభాస్కర్, శోభన్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నడిగూడెం : మండల కేంద్రంలోని కేఎల్ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల నమోదును కోరుతూ ముద్రించిన కరపత్రాన్ని శనివారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ విజయా నాయక్ అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో ఉత్తమ విద్య అందిస్తున్నామని, విద్యార్థులకు పుస్తకాలతో పాటు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యకమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 'గడ్డిపల్లి కేవీకేలో విత్తనాల కొనుగోలు అవాస్తవం'

మునగాల : మండలంలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన రైతు రేగంటి అరవింద్ గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వరి విత్తనాలు కొనుగోలు చేయలేదని ఆ సంస్థ శాస్త్రవేత్త దొంగరి నరేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అరవింద్ తమ సంస్థలో వరి విత్తనాలు కొనుగోలు చేశాడని శుక్రవారం సాక్షి దినపత్రికలో ×వరిపంట పరిశీలన ₹అనే శీర్షికతో వచ్చిన వార్తలో వచ్చిన విషయం అవాస్తవమని తెలిపారు. తమ సంస్థ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని గత కొన్నేళ్లుగా నాణ్యమైన విత్తనాలను మాత్రమే సరఫరా చేస్తుందని పేర్కొన్నారు.

### కేసు నమోదు

మోతె : మండలంలోని నామవరం గ్రామ శివారులో సర్వే నంబర్ 607/1, 607/2, 608/3, 701/2, 701/2/3 లలో 7.10 ఎకరాల భూమి అక్రమంగా పౌతి చేయించుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మోతె తహసీల్దార్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్, ఆర్డీఓ వేణుమాదవ్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### అట్రాసిటీ కేసులో మహిళకు జైలు శిక్ష, జరిమానా

నడిగూడెం : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నడిగూడెం మండల కేంద్రానికి చెందిన మహిళకు ఎస్సీ, ఎస్టీ కోర్టు నల్గొండ జడ్జి రోజారమణి జైలు శిక్ష, జరిమానా విధించారు. నడిగూడెం పోలీస్ ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన కుంభజడ వెంకటమ్మను అదే గ్రామానికి చెందిన అహల్య కులం పేరుతో దూషించినట్లు 2019లో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో ఇరు వర్గాల వాదనలు విన్న జడ్జి శనివారం తీర్పునిచ్చారు. అహల్యకు ఏడు నెలల జైలు శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

### పోలీస్‌స్టేషన్‌కు చేరిన కేజీబీవీ సిబ్బంది వివాదం !

- జీసీడీఓ జోక్యంతో సమస్య పరిష్కారం

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది మధ్య నెలకొన్న వివాదం చివరకు పోలీస్‌స్టేషన్‌కు చేరింది. నాన్ టీచింగ్ మహిళా సిబ్బంది కుటుంబసభ్యులు పాఠశాలకు వచ్చి తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని పాఠశాల స్పెషల్ అధికారి వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న చింతలపాలెం మండల విద్యాధికారి శ్రీనివాస్ శనివారం పాఠశాలలో నాన్ టీచింగ్, టీచింగ్ సిబ్బందిని పిలిపించి మాట్లాడారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ (జీసీడీఓ) అధికారి పూలమ్మకు సమాచారం ఇవ్వగా ఆమె అక్కడకు చేరుకొని వివాదంపై ఆరా తీశారు. ఇరువర్గాలకు సర్దిచెప్పి మరోకసారి ఇలాంటి వివాదాలు పునరావృతం కావొద్దని హెచ్చరించారు. విద్యార్థినులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు.

### ఘనంగా మార్కండేయ జయంతి


మార్కండేయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో శనివారం పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మశాలీల కులదైవమైన మార్కండేయ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సంగిశెట్టి గోపాల్, కొంగర నరసింహారావు, నక్కా చంద్రం, గోలి నాగరాజు, శ్రీనివాస్, ప్రసాద్, రాజేష్, నరేష్ తదితరులు ఉన్నారు.

### జిల్లా టీమ్ లీడర్‌గా పల్లెల లక్ష్మణ్



మోతె : తెలంగాణ సాంస్కృతిక సారథి సూర్యాపేట జిల్లా టీమ్ లీడర్‌గా మోతె గ్రామానికి చెందిన పల్లెల లక్ష్మణ్ ఎన్నికయ్యారు. తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం కళాకారులు తనను సూర్యాపేటలో జరిగిన సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తన ఎన్నికకు సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## భోజనంలో నాణ్యత పాటించాలి


మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ

మునగాల : ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి శిరీష కోరారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత పాఠశాలలోని వసతి గృహంలో గల నిత్యావసర సరుకులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, విద్యార్థులతో కలిసి ఆమె భోజనం చేశారు. పరిసరాల పరిశుభ్రత పాటించి నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని వంట సిబ్బందికి సూచించారు.

## వరి పొలాలను పరిశీలించిన అధికారులు


పాలకవీడులో వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి కళ్యాణచక్రవర్తి

సాక్షి ఎఫెక్ట్..

పాలకవీడు : ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరి.. నాట్లు వేసిన నెల రోజులకే పొట్టదశకు చేరకోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతుండడంతో శనివారం 'అన్నదాతల ఆందోళన'అనే శీర్షికతో సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన పాలకవీడు మండల వ్యవసాయ అధికారి బి.కళ్యాణచక్రవర్తి శనివారం పాలకవీడు, మీగడంపహాడ్‌తండా గ్రామాల్లో బాధిత రైతులతో కలిసి వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వల్పకాలిక మిక్కిలి సన్న రకాల వరి పంటలో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని ఆయన తెలిపారు. సమస్యకు చలి ప్రభావమా, లేక విత్తన లోపమా అనేది తెలియాల్సి ఉందని, మరొకసారి వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి పొలాలను పరిశీలిస్తామని తెలిపారు. పంటల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. యూరియాను వారంరోజులకొకసారి దఫాలుగా అందించి దానికి తోడుగా పోషకాలను స్ప్రే చేయాలని ఆయన రైతులకు సూచించారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీకాంత్, వెంకటేష్, గోపి, రైతులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా బడ్జెట్


కోదాడలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కోదాడ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకే లబ్ధి చేకూర్చేలా ఉందని, పేద ప్రజలకు ఏ మాత్రం ఉపయోగం లేదని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఈమేరకు శనివారం కోదాడ రంగా థియేటర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ముల్కలపల్లి రాములు మాట్లాడుతూ పేదలకు– పెద్దల మధ్య అంతరాలను ఇంకా పెంచే విధంగా బడ్జెట్ ఉందన్నారు. వ్యవసాయ రంగానికి కేటాయింపులు తక్కువగా ఉన్నాయన్నారు. బడ్జెట్ అంకెల్లో మాత్రమే కనిపిస్తుందని, క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేదరమెట్ల వెంకటేశ్వరరావు, ముత్యాలు, దేవరం వెంకటరెడ్డి, రంగారావు, ఏనుగుల వీరాంజనేయులు, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రెగ్యులర్ అధికారులు లేక ఇబ్బందులు


సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

హుజూర్‌నగర్ : జిల్లా కార్మిక సంక్షేమ కార్యాలయంలో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సోమయ్య అన్నారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించిన శిల్పకళ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక సంక్షేమ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ క్లెయిమ్‌ల పరిష్కారం కోసం భవన నిర్మాణ కార్మికులు కార్మిక సంక్షేమ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు టి.రాములు, వి.వెంకన్న, పి.రామకృష్ణ, వి.నరేష్, ముస్తఫా, వేణు, రాంబాబు, అంజయ్య, పద్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

**ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి**

గరిడేపల్లి : కార్మిక శాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలని, బోగస్ కార్డులను ఏరివేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లతో కార్మిక వర్గానికి నష్టం వాటిల్లుతుందని, తక్షణమే ఉపసహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంపాటి రాజు, కడప సాయి, మచ్చ వెంకటేశ్వర్లు, గోపి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

### మాజీ వైస్ చైర్మన్‌కు సన్మానం


నాగేశ్వరావును సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుజూర్‌నగర్ : ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజల మన్ననలు పొందిన నాయకుడు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు అని బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అమర్, ములకలపల్లి రాంబాబు అన్నారు. ప్రజాప్రతినిధిగా ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న ఆయనను శనివారం హుజూర్‌నగర్‌లో శాలువాతో ఘనంగా సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జడ అంజి, ఎల్.వెంకన్న, కె.రామకృష్ణ, ఎస్.వెంకీ, చంద్రమౌళి, రాము, శ్రీనివాసచారి, సాయి, అఖిల్, అన్ను, నాగరాజు, రాజశేఖర్ చారి, సుందర్‌రావు, నరసింహారావు, నరసింహ, రత్నశ్రీ, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నేరేడుచర్ల టౌన్– 2 ఫీడర్ కింద గల రామాపురంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు చేపడుతున్నందున నేరేడుచర్ల పట్టణం -2 పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నేరేడుచర్ల మండల ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏఈ పందిరి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా మండలంలోని 33/11కేవీ తెలగరామయ్యగూడెం సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున ఆ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

### నేడు రాజకీయ యుద్ధభేరి

మునగాల : బీసీ రాజ్యాధికారం కోసం పార్టీలకతీతంగా ఆదివారం వరంగల్‌లోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించే రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పానుగోటి రంగా కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అగ్రవర్ణాల వెన్నులో వణుకు పుట్టేలా బీసీ కుటుంబాల మహాసమ్మేళనం ఉంటుందని, ప్రతి గడప నుంచి బీసీలు కదలిరావాలని పిలుపునిచ్చారు.

### నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

నడిగూడెం : వచ్చే వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇర్ఫాన్ తెలిపారు. శనివారం నడిగూడెంలో మిషన్ భగీరథ ట్యాంక్‌లను వారు పరిశీలించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈ నెల 10వ తేదీ వరకు మంచినీటి వనరులను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉమారాణి, వెంకటేశ్వర్లు, వెంకన్న, మిషన్ భగీరథ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### అరుణోదయ విలీన సభను విజయవంతం చేద్దాం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, నాయకులు

కోదాడరూరల్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 5న తేదీన నిర్వహించనున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కమిటీల విలీన సభను విజయవంతం చేద్దామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి అన్నారు. శనివారం కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గత కొద్ది కాలం క్రితం రెండు పాయలుగా చీలిన అరుణోదయ సంస్థ ఈ సభ ద్వారా వీలినం అవుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కామళ్ల ప్రతాప్, వెంకన్న, జాను, శ్రీను, నగేష్ సైదులు ఉన్నారు.

**విలీన సభను విజయవంతం చేయాలి**

గరిడేపల్లి : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 5న నిర్వహించే అరుణోదయ విలీన సభను విజయవంతం చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా నాయకుడు గండు నాగేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శి మేకల కనకారావు అన్నారు. శనివారం మండలంలోని వెలిదండ గ్రామంలో సభ కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. సభకు కవులు, కళాకారులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ముత్తయ్య, సుందరయ్య, సంతోష, నరేష్, వెంకటేష్, వెంకటి, సువార్త, రేణుక, ఎల్లమ్మ, మల్లమ్మ, లక్ష్మి, కలమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.